
# వైభవంగా లక్ష్మీనరసింహుల దర్బార్ సేవ

యాదగిరిగుట్ట, నవంబర్ 4 : యాదగిరిగుట్ట ప్రధానాలయ ముఖ మండపంలో లక్ష్మీనరసింహస్వామి దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శనివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు పారాయణం చేశారు. అనంతరం స్వామివారికి నక్షత్ర హారతి ఇచ్చి భక్తులకు అనుమతినిచ్చారు. స్వామి, అమ్మవార్లకు నిత్యోత్సవాలు శాస్త్రోక్తంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం చేశారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా కల్యాణ తంతు జరిపారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారిని గరుడవాహనం, అమ్మవారిని తిరుచ్చీ వాహనంపై వేంచేపు చేసి మాఢవీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 23,40,830 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.



యాదగిరిగుట్టలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

# సీఎం కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి

- మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

సంస్థాన్‌నారాయణపురం, నవంబర్4 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గుజ్జ, అల్లందేవిచెరువు, వావిళ్లపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. మునుగోడులో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త ఐకమత్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు సుర్వి యాదయ్య, జక్కర్తి పాపయ్య, ఎంపీటీసీ దోటి జంగయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు గంగదేవి సత్తయ్య, కార్యదర్శి ఏర్పుల సైదులు, జినుకుల యాదయ్య, నాయకులు పగిళ్ల శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీయూలో ముగిసిన ఐసీటీ కబడ్డీ పోటీలు

- యూనివర్సిటీ మహిళా, పురుషుల జట్ల ఎంపిక

రామగిరి, నవంబర్ 4 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని కళాశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న వర్సిటీ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్(ఐసీటీ) కబడ్డీ మహిళా, పురుషుల పోటీలు శనివారం ముగిశాయి. శుక్ర, శనివారంలో హోరాహోరీ జట్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వర్సిటీ జట్లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విజేతలకు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. ఈ నెల 8 నుంచి 12 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జేఎన్‌టీయూ కాకినాడలో జరిగే సౌత్‌జోన్ పురుషుల కబడ్డీ పోటీలకు ఎంజీయూ జట్టు హాజరుకావాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఎంజీయూ ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.మురళి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌జీ కళాశాల పీడీ కడారి మల్లేశ్ పాల్గొన్నారు.



పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు బహుమతి అందచేస్తున్న స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి

**ఎంజీయూ మహిళా జట్టు..**

యూనివర్సిటీ మహిళా జట్టుకు బి.చైతన్య, పి.సోనీ, ఎస్.ధరణి, పి.పూజిత, పి.శిరీష(టీఎస్‌డబ్ల్యూఆర్ఎఫ్‌ఏఆర్‌డీసీడబ్ల్యూ, భువనగిరి), సీహెచ్ అఖిల, హేమ, ఆర్.అనూష, కె.అంజలి(ఎన్‌జీ కళాశాల, నల్లగొండ), కె.అనూష(జేకేసీపీ, హాలియా), కె.మాధవి(టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ, సూర్యాపేట), జి.శ్రీజ(కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోదాడ) ఎంపికయ్యారు. కాగా వెయిటింగ్‌లో ఎం.బిందు, ఎన్.యశస్విని, ఎం.నిర్మల, వి.దీపక ఉన్నారు.

**పురుషుల జట్టు..**

ఎన్.లక్ష్మణ్, కె.కోటేశ్, సీహెచ్.రవితేజ(ఎన్‌జీ కళాశాల, నల్లగొండ), వి.చంద్రశేఖర్(త్రివేణి డిగ్రీ కళాశాల, సూర్యాపేట), బి.సంతోష్(కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోదాడ), పి.శివ(క్రాంతి డిగ్రీ కళాశాల, కొండమల్లేపల్లి), జి.లోకేషన్(ఎంఎస్ఎం, హాలియా), పి.మధు, డి.సందీప్, జి.వేణుగోపాల్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హాలియా), డి.అఖిల్‌కుమార్, గోపాలకృష్ణ (ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్, హాలియా), ఎం.సైదాబాబు(శ్రీసాయి వికాస్ డిగ్రీ కళశాల, కోదాడ) ఎంపికయ్యారు. వెయిటింగ్‌లో కె.వినోద్‌కుమార్, పి.కార్తీక్, ఆర్.సింహాద్రి, పి.అశోక్ ఉన్నారు.



కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

# అభివృద్ధికి మద్దతుగా బీఆర్ఎస్‌లో చేరికలు

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల చేరిక

యాదగిరిగుట్ట, నవంబర్ 4 : సీఎం కేసీఆర్‌తోనే ఆలేరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని, అభివృద్ధికి మద్దతుగానే బీఆర్ఎస్‌లో చేరికలు జరుగుతున్నాయని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆలేరుకు గోదావరి జలాలు అందించడంతో పాటు ప్రతి గ్రామంలో బీటీ, సీసీ రోడ్లు, కుల సంఘాల భవనాలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసినట్లు చెప్పారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని గొంగిడి నిలయంలో మండలంలోని సాధువెల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిన్నపురెడ్డి వెంకట్‌రెడ్డి, దయ్యాల శ్రీరాం, దుబ్బాసి ప్రవీణ్‌తోపాటు 100 మంది, గుండాల మండలం లక్ష్మితండా నుంచి భూక్యా వాసు, రమేశ్, శ్రీను, మాన్‌సింగ్, మల్లేశ్, మింటు, మనక, ఆంజనేయులుతోపాటు 100 మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బొమ్మలరామారం మండలం కేకేతండాకు చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ లావుడ్యా బిచ్చానాయక్, నందానాయక్, గిరినాయక్‌తోపాటు 30 మంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, సాధువెల్లి సర్పంచ్ సత్యలక్ష్మి, బీఆర్ఎస్ వివిధ గ్రామశాఖల అధ్యక్షులు కాకల్ల శ్రీను, బూడిద కృష్ణ, కిషన్‌నాయక్, నాయకులు సురేశ్‌రెడ్డి, ఎల్లుబాయి, భాస్కర్, రామకృష్ణారెడ్డి, కొమ్మాయిపల్లి ఉపసర్పంచ్ పరశురాం, పొలసంఘం చైర్మన్ చంద్రయ్య, రాములు, బిచ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లోకి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రమేశ్**

యాదగిరిగుట్ట : బొమ్మలరామారం మండలం లంజలాల్‌పూర్ గ్రామానికి చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దుంపల రమేశ్, బీజేపీ శక్తి మోర్చా మండలాధ్యక్షుడు పులగల్ల పరమేశ్ శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పీఏసీఎస్ చైర్మన్ గూడె బాల నర్సయ్య, కల్లెం సుమంత్‌రెడ్డి, మోటె యాదగిరి, అయిలయ్య, మహేందర్ పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి మరో అవకాశం ఇవ్వండి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, నవంబర్ 4: నల్లగొండ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఆలోచించి మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పలు వార్డులకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ 20 ఏండ్లలో చేయని అభివృద్ధి కోమటిరెడ్డి ఇవ్వాళ చేస్తానని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు గుక్కెడు మంచినీళ్ల కూడా అరిగోస పడ్డట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మబ్బు బాలు, విష్ణు, గూడపూరి సాయి, కొంగల సాయి, నీలం శంకర్, సాయి, నవీన్, నరేశ్ ఉన్నారు.